సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



పొంగి ప్రవహిస్తున్న బలపం వాగు

ప్రాణాలకు తెగించి రాకపోకలు

చింతపల్లి: భారీ వర్షాలకు మండలంలోని గిల్లెలబంద, చెరువూరు గ్రామాల మీదుగా బలపం వాగు పొంగి ప్రవహిస్తోంది. ఇదే పంచాయతీ పరిధిలో బూరుగుబయలు గెడ్డ, కోరుకొండ ప్రాంతంలో వాగులు కూడా పొంగడంతో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వాగులు దాటాల్సి వస్తోందని సర్పంచ్ రమేష్ తెలిపారు. ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో బిడ్జిలు నిర్మించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

వరదలు తగ్గేవరకు కట్టుదిట్టంగా భద్రత చర్యలు

- ఎస్పీ అమిత్ బర్దర్



కూనవరంలో శబరి బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్

కూనవరం: విలీన మండలాల్లో వరదలు తగ్గే వరకూ భద్రతచర్యలు కట్టుదిట్టంగా ఉండాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో పర్యటించారు. శబరి, బ్రిడ్జి వద్ద గోదావరి, శబరి నదుల ఉధృతిని, ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను ఎస్ఐ శ్రీనివాసరావు నుంచి తెలుసుకున్నారు. వాగుల వద్ద వరద నీటిలో ప్రజలు దాటకుండా చూడాలని, నదుల వెంబడి చేపలు వేటకు వెళ్లకుండా గట్టి భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. వరద ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సీఐలకు, ఎస్ఐలకు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్‌మీనా, ఎటపాక, చింతూరు సీఐలు కన్నపరాజు, దుర్గాప్రసాద్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ పాల్గొన్నారు.

రేపు సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీనృసింహ హోమాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే హోమంలో రూ.2500 టికెట్టు తీసుకుని ఉభయదాతలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈసేవలో భక్తులు ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కానీ టికెట్టు తీసుకొని పాల్గొనవచ్చన్నారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో టికెట్లు లభిస్తాయని తెలిపారు. అలాగే www. aptemples.ap. gov.in టికెట్లు తీసుకోవచ్చని తెలిపారు.

అప్పన్న ఉద్యోగి సస్పెన్షన్

సింహాచలం : మద్యం సేవించి విధులకు హాజరైన సింహాచలం దేవస్థానం ఉద్యోగిని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సస్పెండ్ చేశారు. సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బలిరెడ్డి సన్యాసిరావు విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సన్యాసిరావు మద్యం సేవించి విధులకు హాజరై భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఫిర్యాదు రావడంతో అలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌ను విచారణకు ఆదేశించారు. ఆనంద్‌కుమార్ విచారణ జరిపి మద్యం తాగి వచ్చింది వాస్తవమేనని నివేదిక ఇవ్వడంతో సన్యాసిరావును సస్పెండ్ చేశారు.

వాగులో గల్లంతైన గిరిజనుడి మృతి

చింతూరు: వీఆర్‌పురం మండలం తుష్టివారిగూడెం వద్ద బుధవారం రాత్రి వాగులో గల్లంతైన చెందిన కారం నాగేశ్వరరావు(42) అనే గిరిజనుడు మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రేఖపల్లి పీహెచ్‌సీకి తరలించేందుకు వరదనీరు అడ్డంకిగా మారింది. దీంతో చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు విజ్ఞప్తి మేరకు వైద్యులు పడవపై మృతుడి స్వగ్రామమైన తుష్టివారిగూడెం చేరుకుని అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

పిడుగుపాటుకు గేదెలు మృతి

చింతూరు మండలంలో శుక్రవారం సాయంత్రం భారీగా పిడుగులు పడ్డాయి. దీంతో రామన్నపాలెంలో రవ్వా రామయ్య అనే గిరిజనుడికి చెందిన రెండు గేదెలు మృతిచెందాయి. మండలంలోని మల్లెతోటలో ముచ్చిక చలపతి ఇంటిపై కూడా పిడుగు పడడంతో ఇల్లు స్వల్పంగా దెబ్బతింది.



చింతూరు మండలం కుయిగూరు వద్ద జాతీయ రహదారి-326పై నిలిచి ఉన్న వరద నీరు



వీఆర్‌పురం: వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అపూర్వభరత్, సబ్ కలెక్టర్ కల్పశ్రీ



కూనవరం మండలంలోని శబరి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

దిగ్బంధంలోనే దారులు

గోదావరి, శబరి నదుల ప్రవాహ ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గురువారం భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరికకు చేరువలో గరిష్టంగా 44.5 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 42.4 అడుగులకు తగ్గుముఖం పట్టింది. దీంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఉభయ నదుల ఎగపోటు కారణంగా వాగుల నీరు తగ్గుముఖం పట్టకపోవడంతో వీఆర్‌పురం, చింతూరు, కూనవరం మండలాల్లో రహదారులు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి.

- గోదావరి, శబరి శాంతించినా తగ్గుముఖం పట్టని వాగులు
- ఎగపోటు వల్ల ముంపులోనే రోడ్లు
- చాలా గ్రామాలకు ప్రారంభం కాని రాకపోకలు

చింతూరు: గోదావరి, శబరి నదుల వరద నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద గురువారం రాత్రి గరిష్టంగా 44.5 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ శుక్రవారం సాయంత్రానికి 42.4 అడుగులకు చేరింది. నీటిమట్టం 43 అడుగుల కంటే తగ్గడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. మరోవైపు శబరినది కూడా క్రమేపీ తగ్గుతుండడంతో నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే వరదనీరు ఇంకా రహదారులపైనే ఉండిపోవడంతో చాలా గ్రామాలకు రాకపోకలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం లేదు. ముంపు ప్రాంతాలను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో అపూర్వభరత్, సబ్ కలెక్టర్ కల్పశ్రీలు పరిశీలించారు.

- వీఆర్‌పురం మండలంలో రామవరం–రామవరప్పాడు, చింతరేగుపల్లి–కన్నాయిగూడెం, తుష్టివారిగూడెం–అడివివెంకన్నగూడెం, సీతంపేట–శ్రీరామగిరి, ఇప్పూరు–పోచవరం నడుమ వరదనీరు రహదారుల పైనే నిలిచి ఉంది. దీంతో మండలంలోని 28 గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకుండా పోయింది.



శ్రీరామగిరిలో దోమతెరలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే శిరీషాదేవి



వరద నీటిలోంచి వీఆర్‌పురం వెళ్తున్న వడ్డిగూడెం గ్రామస్తులు

- చింతూరు మండలంలో శబరినది నెమ్మదిగా తగ్గుతున్నా వాగుల నీరు ఇంకా రహదారుల పైనే ఉంది. కుయిగూరు వాగు వరదనీరు జాతీయ రహదారి–326పై నిలిచి ఉండటంతో రెండోరోజు కూడా ఆంధ్రా నుంచి ఒడిశాకు చింతూరు మండలంలోని కుయిగూరు, కల్లేరు, సూరన్నగొంది, మదుగూరు గ్రామాలకు రాకపోకలు సాగలేదు.
- సోకిలేరు, జల్లివారిగూడెం, చంద్రవంక, చీకటి వాగుల వరదనీరు కారణంగా మూడోరోజు సైతం చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య, చింతూరు మండలంలోని 18 గ్రామాలకు కూడా రాకపోకలు కొనసాగలేదు.

కూనవరం: శబరి, గోదావరి నదులు తగ్గుముఖం పట్టడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కూనవరం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 43 అడుగులకు చేరింది. అయితే భద్రాచలం వద్ద తగ్గముఖం పట్టడం ఊరటనిచ్చింది. అలాగే కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపై పోలిపాక, ముర్మూరు మధ్య వరద నీరు తగ్గుముఖం పట్టడంతో సాయంత్రం ఆరు గంటలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి బస్సులు యథావిధిగా తిరుగుతాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. టేకులబోరు, కొండ్రాజుపేట రహదారిపై మూడవ రోజు కూడా వరద నీరు కొనసాగుతూనే ఉంది. శబరి కొత్తగూడెం, పూసుగు గూడెం, శ్రీరామ్‌పురం, వెంకన్నగూడెం, కొత్తూరు, చినార్కూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

క్షేత్రస్థాయిలో అప్రమత్తత తప్పనిసరి : అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన

చింతూరు: వరదల పట్ల క్షేత్రస్థాయిలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన వరద ప్రాంతాల అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్సులో ఆయన పలు సూచనలు చేశారు. వరద పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు జాగ్రత్త వహించాలని, వరద పెరిగితే ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఎగువ ప్రాంతాల్లో నీటి విడుదలకు సంబంధించిన వివరాలతో పాటు వరద పెరుగుదలకు సంబంధించి ప్రతి గంటకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత వరదల కారణంగా వీఆర్‌పురం మండలంలో ఆరు, కూనవరం మండలంలో నాలుగు, చింతూరు మండలంలో ఎనిమిది, ఎటపాక మండలంలో మూడు రహదారులు ముంపునకు గురైనట్లు ఆయన తెలిపారు. వీఆర్‌పురం మండలంలో 3,851 కుటుంబాలు వరదల కారణంగా ప్రభావితమయ్యాయని, వీరికి మూడువేల కిలోల చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. వీరికోసం 27 మెట్రిక్ టన్నుల బియ్యం, 3,500 కిలోల కందిపప్పు, 3,500 లీటర్ల పామాయిల్ పంపించినట్టు చెప్పారు. రహదారులు ముంపునకు గురైన ప్రాంతాల్లో 15 బోట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అవసర సమయంలో వినియోగించేందుకు మరో 45 బోట్లను సిద్ధంగా ఉంచామన్నారు. ఆయనతోపాటు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో అపూర్వభరత్, సబ్ కలెక్టర్ కల్పశ్రీ శుక్రవారం వీఆర్‌పురం మండలంలో పర్యటించారు. శ్రీరామగిరిలో వరద బాధిత కుటుంబాలకు దోమతెరలు, కందిపప్పు, మంచినూనె పంపిణీ చేశారు.



చింతూరు- వీఆర్‌పురం మార్గంలో చూటూరు వద్ద రహదారిని ముంచెత్తిన వరద నీరు

దాలియా పూల సోయగం

- పాడేరు, హుకుంపేట మండలాల్లో వాణిజ్య పరంగా సాగు
- అనుకూలించిన వాతావరణం
- మంచి దిగుబడితో ఆదాయం
- సంక్రాంతి వరకు సీజన్



విరగబూసిన దాలియా

సాక్షి, పాడేరు: అందాలకు నెలవైన మన్యానికి దాలియా పూలు మరింత వన్నె తెస్తున్నాయి. పాడేరు మండలంలోని బరిసింగి, చింతలవీధి, గుత్తులపుట్టు, డోకులూరు, డి.గొందూరు, హుకుంపేట మండలంలో మఠం, గూడ, ములియాపుట్టు, అడ్డుమండ, బారామోసి ప్రాంతాల్లోని పెరటి, మెట్ట,కొండపోడులో గిరిజనులు దాలియా పూలను పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో వివిధ రంగుల్లో విరబూశాయి. ఒకప్పుడు సరదాగా పండించే ఈ పూలు ఇప్పుడు వాణిజ్య పంటగా మారింది. ఏటా వీటి అమ్మకం ద్వారా గిరిజనులు మంచి ఆదాయం పొందుతున్నారు. ఈ పూలకు మైదాన ప్రాంతంలో మంచి గిరాకీ ఉంది. శ్రావణమాసం నుంచి సంక్రాంతి వరకు వీటి సీజన్ ఉంటుంది. స్థానిక వ్యాపారులు గిరిజనుల నుంచి కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలించిన విక్రయిస్తున్నారు. వినాయక చవితి పండగ నేపథ్యంలో ఈ పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. స్థానిక మార్కెట్లో శుక్రవారం బుట్ట పూలు రూ.50 నుంచి రూ.100కు వ్యాపారులు కొనుగోలు చేశారు.



మీ పిల్లలకు ఇలాంటి గుడ్లే పెడతారా?

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం
- సీలేరు గురుకుల పాఠశాల సందర్శన
- స్టాక్‌రూమ్‌లో నాణ్యతలేని గుడ్లు ఉండటంతో నిర్వాహకులపై ఆగ్రహం

సీలేరు: మీ పిల్లలకు ఇలాంటి కోడిగుడ్లనే పెడతారా అని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన మెనూ అమలులో లోపాలను గుర్తించారు. ఉడికించి పెడుతున్న గుడ్లు కుళ్లిపోయి ఉండటం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటివి పిల్లలకు పెడితే వారి ఆరోగ్యం ఏమవుతుందని ప్రశించారు. విద్యార్థులకు పంపిణీ చేస్తున్న మజ్జిగ నాణ్యతగా లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. స్టాక్ రూమ్‌లోని 1250 గుడ్లను పరిశీలించారు. వీటిలో సగానికి పైగా కుళ్లిపోయి, వాటిపై ఫంగస్ పట్టి ఉండటంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దీనిపై నిర్వాహకులను ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో వచ్చిన గుడ్లన్నీ అలాగే ఉన్నాయని వారు వివరించారు. నాణ్యత పరీక్షల నిమి త్తం వీటిలో కొన్నింటిని ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు చెప్పారు. స్టాక్ రూమ్‌లో ఆకు కూరలు లేకపోవడంపై ప్రశ్నించారు. దీని పై నిర్వాహకులనుంచి సరియైన సమాధానం రాలేదు. పిల్లల నుంచి సమస్యలు తెలుసుకున్నారు.ఏజెన్సీ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దని వారికి సూచించారు. కలుషితమైన ఆహారం విద్యార్థులకు అందివ్వడం వల్ల అనారోగ్యానికి గురై ప్రాణాలమీదకు వస్తోందన్నారు. అయినప్పటికీ నిర్వాహకుల్లో మార్పులేకపోవడం బాధాకరమన్నారు. సీలేరు గురుకుల పాఠశాలలోని కుళ్లిన కోడి గుడ్ల వ్యవహారంపై కలెక్టర్, గురుకుల సెక్రటరీకి ఫిర్యాదు చేస్తామని విలేకరులకు ఎమ్మెల్యే తెలిపారు.



కోడి గుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

నష్టపరిహారం చెల్లించాకే పంప్డ్ స్టోరేజీ నిర్మాణం

- లేకుంటే పనులను అడ్డుకుంటాం
- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు హెచ్చరిక

సీలేరు: పార్వతీనగర్ వద్ద ప్రభుత్వం నిర్మించబోయే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిరాశ్రయులకు అన్ని సదుపాయాలు కల్పించిన తరువాతనే నిర్మాణం చేపట్టాలని, లేకుంటే పనులను అడ్డుకుంటామని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మించబోయే పార్వతీనగర్, శాండ్ క్వారీ, వలసగడ్డ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన గిరిజనులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తాము ఇక్కడ నివాసం ఉంటున్నామని, ఎటువంటి సదుపాయం కల్పించకుండా గ్రామాలు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారని వారు వాపోయారు. పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తేనే గ్రామాలను ఖాళీ చేస్తామని గిరిజనులు స్పష్టం చేశారు. ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం జెన్‌కో అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మించబోయే గ్రామాల్లో ఇంటికి ఇల్లు, భూమి, ఇంటికో ఉద్యోగం, నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందించాలని ఆయన స్పష్టం చేశారు. లేకుంటే ప్రాజెక్టు పనులను జరగనీయమని హెచ్చరించారు. భారీ ప్రాజెక్ట్ ఈ ప్రాంతంలో ఏర్పాటు మంచిదే అయినప్పటికీ, నిరాశ్రయులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ ఇవ్వాలని ఆయన అధికారులను కోరారు. ప్రాజెక్ట్ నిర్మాణ వివరాలను జెన్‌కో ఎస్ఈలు రామభద్రరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీ అప్పలనాయుడు, ఏఈ సురేష్, ఎమ్మెల్యేకు వివరించారు. నిరాశ్రయులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ వచ్చేలా తనవంతు కృషి చేస్తానని గిరిజనులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నష్టపరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపడితే అడ్డుకునేందుకు ఆందోళనలో తాను ముందుంటానని వెల్లడించారు. వసతులు కల్పించాకే గ్రామాలు ఖాళీ అయ్యేలా చూస్తానన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పథకాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటుతున్నా పింఛను మినహా ఏ ఒక్క పథకాన్ని ప్రజలకు అందించలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పరిపాలన చూసి సిగ్గు తెచ్చుకోవాలన్నారు. ఎంపీపీ కుమారి, బొబ్బిలి లక్ష్మణ్, సీలేరు ఎంపీటీసీ సాంబమూర్తి, సర్పంచ్ దుర్గు పాల్గొన్నారు.



గిరిజనుల నుంచి వినతిపత్రం అందుకుంటున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



ఏపీ జెన్‌కో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

నాణ్యమైన ఆహారం పెట్టాల్సిందే

- లేకుంటే శాఖాపరమైన చర్యలు
- విద్యాశాఖ జేడీ, రాష్ట్ర నోడల్ అధికారి ఎంవీ కృష్ణారెడ్డి హెచ్చరిక



పాడేరు కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న జాయింట్ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి

సాక్షి, పాడేరు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, లేకుంటే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర నోడల్ అధికారి ఎంవీ కృష్ణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పాడేరులో పర్యటించారు.జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. యూడైస్, స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, పాఠశాలలు, కేజీబీవీల్లో మెనూ అమలు, డిజిటల్ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్‌ఎంలను హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఎఫ్ఏ–1 పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. టెన్త్ విద్యార్థులతో సమావేశమైన ఆయన వారి నుంచి బోధన సమాచారం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు వినయ్‌మోహన్, అప్పారావునాయుడు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్, డీసీడీవో సూర్యకుమారి పాల్గొన్నారు.



పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు



పూలను కొనుగోలు చేస్తున్న మహిళలు



ఉత్సవానికి కొనుగోలు చేసిన గణపతి విగ్రహం

మార్కెట్‌కు చవితి శోభ



జనాలతో కిక్కిరిసి పోయిన పాడేరు మెయిన్ రోడ్డు

- పాడేరు మార్కెట్లో సందడి
- పూజా సామగ్రి భారీగా కొనుగోలు
- భారీగా విగ్రహాల అమ్మకాలు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో మార్కెట్‌కు చవితి శోభ నెలకొంది. విగ్రహాలు, పూజా సామగ్రి, పండ్ల కొనుగోలుకు శుక్రవారం భారీగా మహిళలు తరలివచ్చారు. వారపు సంత కూడా శుక్రవారం కావడంతో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారితో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాతబస్టాండు నుంచి మెయిన్‌రోడ్డు వరకు మార్కెట్ ప్రాంతమంతా రద్దీగా కనిపించింది. రోడ్డు పక్కనే మార్కెట్ కావడంతో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బంది ఏర్పడింది. పూలు, పండ్ల ధరలు వ్యాపారులు భారీగా పెంచేశారు. చవితి ఉత్సవాలకు సంబంధించి గణపతి విగ్రహాలను కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకువెళ్లారు. మట్టి గణపతి విగ్రహాలతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల కొనుగోళ్లు భారీగా జరిగాయి. సుమారు వెయ్యి వరకు విగ్రహాలు అమ్ముడైనట్టు వ్యాపారులు తెలిపారు.



మట్టి గణపతి ప్రతిమలను పరిశీలిస్తున్న మహిళలు

క్లుప్తంగా

రొయ్య పిల్లల పంపిణీ



రైతులకు రొయ్య పిల్లలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త వీరాంజనేయులు

రంపచోడవరం: రంపచోడవరం పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో జన్యుపరంగా అభివృద్ధి పరిచిన మంచినీటి రొయ్య పిల్లలను ఎస్సీ ప్రణాళిక కింద శుక్రవారం రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకె మృత్య శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉండే నేలలకు కేవీకే అభివృద్ధి చేసిన విత్తన రొయ్య పిల్లలు అనుకూలంగా ఉంటాయన్నారు. 40వేల రొయ్య పిల్లలను రైతులకు పంపిణీ చేశారు. కెవీకె శాస్త్రవేత్త డాక్టర్ ఆదర్శ తదితరలు పాల్గొన్నారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవోగా సుధా శారద



నర్సీపట్నం: నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవోగా ఎస్.వి.సుధా శారదను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డాక్టర్ సుధా శారద అల్లూరి జిల్లా చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో ఆర్ఎంవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ పోస్టులో సుధా శారదను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

డాక్టర్ రమాదేవికి సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ పురస్కారం



కూచిపూడి నాట్య నిపుణురాలు రమాదేవి

మద్దిలపాలెం: ప్రముఖ కూచిపూడి నర్తకీమణి, నాట్య పరిశోధకురాలు, ప్రయోక్త, రచయిత్రి డాక్టర్ పి.రమాదేవి పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ పురస్కారం–2024కు ఎంపికయ్యారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్ఎండీఏ) సంచాలకుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఎన్ఎండీఏ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో కళాభారతి ఆడిటోరియంలో అఖిలభారత శాస్త్రీయ నృత్యోత్సవం, వైశాఖీ నృత్యోత్సవం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజుల పాటు దేశ విదేశాలకు చెందిన శాస్త్రీయ నృత్య కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా రమాదేవిని సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ పురస్కారంతో సత్కరించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నంది టీవీ ఫిల్మ్ జ్యూరీ సభ్యురాలిగా పనిచేశారు. 27 నృత్య నాటకాలకు దర్శకత్వం వహించి, ఏడు నృత్య నాటకాలను రచించారు.

సీహెచ్‌సీలో రోగుల ఆకలి కేకలు



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో భోజనం అందక అర్థాకలితో ఉన్న రోగులు



రోగులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

- అర్థాకలితో ఇబ్బంది పడుతున్న పేషెంట్లు
- ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోని నిర్వాహకులు

ముంచంగిపుట్టు : మండల కేంద్రంలోని స్థానిక సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో గత మూడు రోజులుగా రోగులకు సక్రమంగా భోజనం అందటం లేదు. దీంతో శుక్రవారం రోగులు ఈ విషయం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలితో పాటు సీపీఎం నేతల దృష్టికి తీసుకెళ్లారు. 60 మంది రోగులు ఉంటే 20 మందికే భోజనాలు తెస్తున్నారని, వాటినే అందరికీ సరిపెడుతున్నారని, కూర అందజేయడంలో అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని, గరిటెతో కాకుండా స్పూన్‌తో కూర వడ్డిస్తున్నారని, గుడ్లు కూడా కొంత మందికే అందిస్తున్నారని తెలిపారు. అన్నం ఉడకటం లేదని వాపోయారు. అర్థాకలితో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సీపీఎం నేతలు త్రినాథ్, గాసిరాం దొర, లైకోన్, రాందాసు, గిరిజన మహిళా సంఘం అధ్యక్షురాలు ఈశ్వరి, వైఎస్సార్‌సీపీ నేత దాసు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నేత, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ రోగులకు సరైన భోజనం పెట్టకపోవడం బాధాకరమన్నారు. గతంలో పలుమార్లు రోగుల భోజనాల విషయంలో ఇదే పరిస్థితి నెలకొన్నా నిర్వాహకుల తీరు మారకపోవడం దారుణమన్నారు. నిర్వాహకులను మార్చి, రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేకపోతే రోగుల పక్షాన ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ విషయం సూపరింటెండెంట్ గీతాంజలి వద్ద ప్రస్తావించగా మెనూ అమలు విషయంలో నిర్వాహకులను పలుమార్లు హెచ్చరించామని, రోగుల ఫిర్యాదు మేరకు మెనూ అమలుపై ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. భోజనాల విషయంలో రోగులు ఇబ్బందులు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



పాడేరులో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి

సాక్షి,పాడేరు: తొలి పండగ అయిన వినాయక చవితిలో భక్తులంతా మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను పూజలకు ఉపయోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం అవ్వాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి పిలుపునిచ్చారు. మోద కిరణ్ మణికంత అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పాడేరులో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ తనూజరాణి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతి విగ్రహాలను వినియోగించవద్దని, అవి నీటిలో కరగవని, దీంతో నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదముందని పర్యావరణ వేత్తలు చెబుతున్నా భక్తులు విస్మరించడం బాధాకరమన్నారు. ఈ మేరకు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలనే ఉత్సవాల్లో వినియోగించాలని ఆమె కోరారు. మట్టి గణపతి విగ్రహాలను అందుబాటులోకి తీసుకొచ్చిన మోద కిరణ్ మణికంత అన్నదాన ట్రస్ట్ నిర్వాహకులతో పాటు అనేక ఎన్‌జీవో సంస్థలకు, ప్రభుత్వ అధికార యంత్రాంగానికి ఎంపీ అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్, మోదకిరణ్ మణికంత అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు శివరాత్రి శ్రీనివాసకుమార్, ముకుందు, ఎస్.డి.రవి, రత్నం, శ్యామల, మంగా, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కుంజం చిన్నాలరావు (చిన్నా) మృతదేహం

గంగవరం : మండల కేంద్రమైన గంగవరంలో శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు గంగవరం అడిషనల్ ఎస్ఐ రాంబాబు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మధ్య వీధికి చెందిన కుంజం చిన్నాలరావు దొర (చిన్నా 42) అనే వ్యక్తి కూలి పనికి వెళ్లి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతి వేగంగా వెనుక నుండి వచ్చిన టీవీఎస్ మోటార్ సైకిల్‌తో ఓ వ్యక్తి వేగంగా గుద్దడంతో చిన్నాలరావు దొర రహదారిపై పడిపోగా తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం అయింది. దీంతో అతన్ని స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అడిషినల్ ఎస్ఐ రాంబాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దిండి బాబి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు కొమ్మన చిన్నారావు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. చిన్నా మృతికి గంగవరం యువసేన యువకులు వెంకటరమణ, శేషు, అనిల్, రాంబాబు, స్వామి, సిద్దు, శివ, కిశోర్ , రమేష్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేయాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



జీసీసీ అధికారులతో సమావేశమైన అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, సిబ్బంది

అరకులోయటౌన్: ఏజెన్సీలో గిరిజనులు పండించే వాణిజ్య పంటలతో పాటు, అడవి నుంచి సేకరించే అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేయాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం జీసీసీ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీసీసీ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్ కాబట్టి గిరిజనులు ఎంతో ఆశతో పంటలు పండించే పంటలకు గిట్టుబాటు ధర లభించక తీవ్ర నష్టపోతున్నారన్నారు. అటువంటి రైతులకు వారు పండించే పంటలకు మార్కెట్‌లో విక్రయించి నష్టపోకుండా జీసీసీ ఆదుకోవాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా జీసీసీ ఉన్నతాధికారులు కృషి చేయాలన్నారు. అరకులోయ జీసీసీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు గిరిజనులకు జీసీసీ అందిస్తున్న సేవలపై ఎమ్మెల్యే మత్స్యలింగంనకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మత్స్యలింగంను జీసీసీ మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. జీసీసీ గొడౌన్ ఇన్‌చార్జి కోటేశ్వరరావు, జీసీసీ సూపర్ మార్కెట్ ఇన్‌చార్జి కొర్రా గురునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే ప్రవర్తన దారుణం

- ఆయనపై లైంగికదాడి, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి
- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రవర్తన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తనపై ఎమ్మెల్యే ఆదిమూలం లైంగికదాడికి పాల్పడ్డారని టీడీపీకి చెందిన ఒక మహిళ ఆరోపణ చేయడం ఆ పార్టీకి సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యేపై ఆరోపిస్తున్న మహిళ ఏపీలో కాకుండా, పక్క రాష్ట్రంలో మీడియాతో మాట్లాడిందంటే, తను ఎంత భయపడుతుందో అర్థమవుతోందన్నారు. ఒక ఎమ్మెల్యే అంత దారుణంగా వ్యవహరించడం, బాధితురాలు ఏకంగా పూర్తి సాక్ష్యాధారాలతో మీడియా ముందుకు రావడాన్ని ప్రస్తావించిన సుభద్ర, ఆయనపై అత్యాచారం, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఇంత దారుణంగా వ్యవహరించడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యేపై టీడీపీ అధిష్టానం కేవలం సస్పెన్షన్‌తో సరిపెట్టడం ఏ మాత్రం సరికాదన్నారు. బాధిత మహిళకు న్యాయం జరగాలని ఆమె డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, వైస్ఎంపీపీ శిరగం భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, సర్పంచులు రమేష్,గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థినులను ఇబ్బందులు పెట్టడం తగదు

కిలగాడ కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతిపై ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎంపీ తనూజ రాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం



ప్రిన్సిపాల్ జ్యోతిని ప్రశ్నిస్తున్న ఎంపీ తనూజరాణి, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: విద్యార్థినులు రోడ్డెక్కేలా ఇబ్బందులు పెట్టడం దారుణమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీచైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రలు కిలగాడ కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మండలంలోని కిలగాడ కేజీబీవీని సందర్శించారు. ఆందోళనకు దిగిన విద్యార్థినులతో వారు మాట్లాడారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, రుచిలేని కూరలు పెడుతున్నారని దీనిపై ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్ జ్యోతి,అకౌంటెంట్లు దురుసుగా ప్రవరిస్తున్నారని విద్యార్థినులు వాపోయారు. వారిద్దని బదిలీ చేయకుంటే ఇళ్లకు వెళ్లిపోతామని వారు హెచ్చరించారు. వసతి గృహంలో సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలన్నింటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన స్టాక్, విజిట్,తదితర రికార్డులు ఎమ్మెల్యే పరిశీలించారు. వాటిలో ఏవీ సక్రమంగా లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. వీటన్నింటిని కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మెనూ విషయంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ విద్యార్థినులకు సూచించారు. ఎంపీపీ సీతమ్మ, పెదబయలు జెడ్పీటీసీ బొంజుబాబు, స్ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు రమేష్, శివశంకర్, సురేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



చింతపల్లిలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ జాహ్నవి, ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీఎం భాస్కరరావు



అడ్డతీగలలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

చింతపల్లి: ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా విస్తరించాలని చింతపల్లి వ్యవసాయశాఖ ఏడీ కంటా జాహ్నవి అన్నారు. శుక్రవారం చింతపల్లిలోని రైతు భరోసా కేంద్రంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలకు సంబంధించి ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్లూరి జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీఎం భాస్కరరావు హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఒనగూరే ప్రయోజనాలను మూడు మండలాల నుంచి హాజరైన వీఏవోలు, వీహెచ్ఏలకు వివరించారు. రసాయన ఎరువులు. పురుగు మందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించారు. మూడు మండలాల వ్యవసాయాధికారులు, శ్రీనివాసరావు, మధుసూధనరావు, ఉమాదేవి, పద్మశోభ, ప్రకృతి వ్యవసాయ విభాగ పాడేరు, చింతపల్లి సమన్వయకర్తలు కుమార్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

అడ్డతీగల: ఆయిల్‌పామ్ సాగులో ప్రత్యేకతలు గుర్తించాలని పతంజలి ఫుడ్స్ డీజీఎం ఎ.ఎస్.ప్రకాశ్ అన్నారు. మండలంలోని దొడ్డివాకలో శుక్రవారం రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యత, ప్రత్యేకతలను వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకి అవసరమైన ఎరువులు, అంతర పంటలు, బిందుసేద్యం సంబంధిత పనిముట్లు విషయంలో ప్రభుత్వం ద్వారా రాయితీలను వివరించారు. సాగుకి పతంజలి ఫుడ్స్ అందిస్తున్న సదుపాయాలను తెలియజేశారు. కిమ్మూరు సర్పంచ్ గుల్లెల రాజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ 2BHK 2 Flats for sale 3rd & 4th Floor Simhadri Residency, Padmavathi Nagar, Shipyard Colony, Vepagunta Road. Ph : 98853 85187 [V- 786841]

■ సొంత ఇల్లు కొనుక్కోవాలనుకుంటున్నారా? అప్పుఘర్ లో మెగా గేటెడ్ కమ్యూనిటీలో రూ. 28 లక్షలకే 2 BHK ఫ్లాట్, రూ. 35 లక్షలకే 3 BHK ఫ్లాట్ కొనండి 160 + అమెనిటీస్‌తో, 2 గ్రా॥ బంగారు నాణెం మీ సొంతం. ఫోన్ : 85229 12331 [V- 6554]

GODOWN FOR SALE

■ 430 Sq.yds 18x15 Office, 7 HP power Bore at Venkannapalem, Beside Pedagantyada Industrial Area, Gajuwaka, Vizag. Ph : 62813 74815 [V- 823829]

HOUSE FOR SALE

■ 2 BHK Independent House, 242 Sq. yrds. Newly Constructed, Build up Area, 1240 Sft. with Car Parking, South Facing (VUDA) at Rajula Tallavalasa. Ph: 81212 71313, 81212 51313. [V- 2665]

LAND FOR SALE

■ ఆనందపురం – పెందుర్తి హైవే నీలకుండీలు గెడిజాలలో VMRDA అప్రూవ్ 440, 521, 533, 1054, 1758 గజాలు. గజం 4,800/-. గండిగుండం దగ్గర రామవరంలో 16 సెంట్లు (N/F), పెందుర్తిలో ఇండివిడ్యువల్ ఇల్లులు E/F, లంకెలపాలెం హైవే ఆనుకొని 656 గజాలు (N/F). Ph:98851 66445. [V- 823821]

www.sakshi.com

PLOT FOR SALE

■ జన చైతన్య చింతలపాలెం ఫేజ్ : II వుడా లే అవుట్‌లో 200 గ॥లు & ఫేజ్ IV లో 400 గ॥లు, ఈస్ట్ ఫేస్‌లో ప్లాట్స్ అమ్మబడును. సంప్ర : 73960 58058, 99669 19638 [V- 823853]

■ Plots Mesuring 250, 500, 1500, 3000 Sq.Yds. of Own Property for Sale with 40 Feet wide Roads. Location Y.Junction Bheemili road Walkable distance from Highway. Backside of Chaitanya college, Anandapuram. Cont : 98495 46969 [V- 2686]

■ 400 Sq. yards walkable Distance from Akkireddipalem Bus Stop. Jirayithee Land, Entrance 10 Feet Road. Ph : 99481 85588 [V- 786836]

■ Vuda Approved Plots for Sale. 311 Sq.yds, 40x70 S/F, (33" Road). Clear Title, Kodandarama Layout, Timmapuram. Kapulauppada. 500 mts from Beach Road. Brokers excuse. Ph: 95915 97984, 85006 54961 [V- 776799]

■ Plot for Sale, VUDA Plot 250 Sq.Yds near Sujathanagar & Laxmipuram, 95th ward, GVMC. Ph : 80192 24991, 99088 51659 [V- 1909]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

SEPTIC TANK CLEAN

■ విజయ్ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగుపొరుగు వారికి ఎలాంటి దుర్వాసన లేకుండా 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 93931 55552, 96765 57552 [V-2677]

Wanted

■ Wanted Male and Female work for MNC company Qul:10th to degree, Sal: 15k to 25k. cont: 9030612463 (work from home facility is available) [G-9026]

■ Wanted Female EM Subject Teachers for Classes 4th to 7th Std. Maths, Telugu, Social, Science, Hindi, English. Cont : 95811 26947. Old Post Office, 1 Town [V- 823856]

■ ప్రముఖ నేషనలైజ్డ్ బ్యాంక్ హోంలోన్స్‌లో ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ & Sr. ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. జీతం : 15000 – 20,000 + ఇన్సెంటివ్స్. NAD, వైజాగ్. సంప్ర : 85229 78149 [V- 823823]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి / వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం .జీతం 20K.ఫోన్: 8977639662, 8977639663 [H-796273]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందం చాల్పించిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఘనంగా జోల్డా పండుగ



వంతాలలో జోల్డా కొమ్మలతో గిరిజన రైతులు



జోల్డా కొమ్మలను నాటుతున్న గిరిజన రైతు

జి.మాడుగుల: గిరిజన సంప్రదాయ బద్ధంగా మండలంలో పలు గ్రామాల్లో గల గిరిజన రైతులు శుక్రవారం జోల్డా పండుగను ఘనంగా జరుపుకున్నారు.గిరిజన ప్రాంతాల్లో వరినాట్లు పూర్తయిన మూడు వారాల్లో కొత్తకొత్త పండుగ జరుపుకొని అనంతరం గ్రామ పూజారి, గ్రామ పెద్దలు కలసి నిర్ణయించిన రోజున ఈ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే వంతాల పంచాయతీ కేంద్రంలోను, ఇతర గ్రామాల్లోను గిరిజన ఆచారవ్యవహాల మేరకు రైతులు భక్తి శ్రద్ధలతో జోల్డా పండుగ నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో లభించే కసిమి, జీలుగు, సీత తదితర ఔషధ మొక్కలను గిరిజనుల సేకరించి ఆయా కొమ్మలను గ్రామంలోని గిరిజన పూజారి శంకుదేవుని సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు జరిపి కోడిపిల్ల రక్తంతో కలిపిన అక్షింతలు, జొల్డా కొమ్మలను గిరిజన రైతులకు అందించారు. రైతుల ఇళ్లల్లో తయారీ చేసిన పిండి వంటలు, నైవేద్యం, కొబ్బరికాయ ఇతర సామాగ్రితో పాటు జోల్డా కొమ్మలతో పంటపొలాలు, ఇతర పంట భూముల్లో పూజలు నిర్వహించారు. అనంతరం జొల్డా కొమ్మలను నాటి , ఆయా అక్షింతలు పొలాల్లో నాలుగు దిక్కులా జల్లారు. ఈ విధంగా చేయడం వలన పంటలకు చీడపీడలను రక్షణతో పాటు దిగుబడులు వస్తాయని గిరిజన రైతులు నమ్మకం. వంతాల గ్రామంలో మండల జేసీఎస్ కన్వీనర్ లంకెల కళ్యాణ్, రైతులందరు ఒక చోటకు చేరి పంట పొలాల్లో విందు భోజనాలు చేసి సందడి చేశారు.

ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ

ఉద్యోగుల సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గం

గాజువాక: విశాఖ ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర సంఘం నుంచి ఎన్నికల పరిశీలకులుగా హాజరైన పి.ఉగ్రసేన, బి.రామభద్రరాజు, కె.రామకృష్ణ సమక్షంలో గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వి.ఆనందరావు (యలమంచిలి), ప్రధాన కార్యదర్శిగా వి.అజయ్ కుమార్ (మల్కాపురం), ఉపాధ్యక్షురాలిగా పి.దమయంతి (నర్సీపట్నం), సహాయ అధ్యక్షుడిగా వై.వెంకటేశ్వర్లు (మాడుగుల), సహాయ కార్యదర్శిగా బి.సూర్యకళ (పెందుర్తి), ప్రచార కార్యదర్శిగా ఎల్.రాజేంద్రవర్మ (డీసీఎల్), కోశాధికారిగా కె.శ్రీనివాసరావు (తుమ్మపాల), రాష్ట్ర ప్రతినిధిగా ఎల్‌వీ రమణ, కార్యవర్గ సభ్యులుగా ఎన్‌వీనర్సింహం (అడవివరం), బీవీఎస్.అప్పారావు (పద్మనాభం), ఎం.సత్యవతి (పాడేరు), బి.చంద్రకళ (గాజువాక), బి.కనకరాజు (గాంధీగ్రాం), జి.హైదిరాజు (జెడ్‌జీఎస్) తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యకవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుందని కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ గ్రంథాలయాల ప్రతినిధులు ఆర్.కన్నబాబు, ఓ.శ్రీనివాసరావు, వి.మోహన, ఆర్‌సీహెచ్.వెంకటరావు, పద్మావతి దేవి, పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లకు అదనపు హాల్ట్‌లు



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లకు శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్‌లలో అదనపు హాల్ట్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సంత్రగచ్చి (06089) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– సంత్రగచ్చి (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తాంబరం–సంత్రగచ్చి(06095) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–తాంబరం (06096) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లకు ఆయా రోజుల్లో శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్‌లలో ఇరు వైపులా హాల్ట్ కల్పించారు. ఈ స్టేషన్‌లలో రెండేసి నిమిషాలు ఈ రైళ్లు ఆగుతాయి.

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈ మార్గంలో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా విశాఖ చేరుకున్నాయి. ఉదయం రావలసిన గోదావరి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.3గంటలకు, ఉదయం 6.50గంటలకు చేరుకోవలసిన మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లు సాయంత్రం 6 గంటల తరువాత చేరుకున్నాయి. దీంతో విశాఖ నుంచి బయల్దేరాల్సిన విశాఖ–మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్‌ను 5 గంటలు, విశాఖ–అమృతసర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, విశాఖ– సికింద్రాబాద్(12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ 3గంటలకు పైగా రీ షెడ్యూల్ చేశారు.

యశ్వంత్‌పూర్ వరకు హౌరా –సత్యసాయి ప్రశాంతి నిలయం స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: హౌరా–సత్యసాయి ప్రశాంతి నిలయం–హౌరా మధ్య స్పెషల్ రైళ్లు యశ్వంత్‌పూర్ వరకు పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రతి బుధవారం హౌరాలో బయలుదేరే హౌరా–శ్రీ సత్యసాయిప్రశాంతి నిలయం (22831) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి యశ్వంత్‌పూర్ వరకు నడుస్తుంది. ఈ రైలు గురువారం రాత్రి 9.30గంటలకు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంనకు చేరుకుని, అక్కడ నుంచి 9.32గంటలకు బయల్దేరి మధ్యరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ వెళ్తుంది. ప్రతి శుక్రవారం శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంలో బయలుదేరాల్సిన శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం–హౌరా (22832) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి యశ్వంత్‌పూర్‌లో బయలుదేరుతుంది. యశ్వంత్‌పూర్‌లో ప్రతి శుక్రవారం ఉదయం 5గంటలకు బయలుదేరి ఉదయం 7.40 గంటలకు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంనకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.42 గంటలకు బయలుదేరి శనివారం మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా వెళ్తుంది.